రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:35
బుధవారం
సహర్ | 4:51
గురువారం

ఎమ్మెల్సీ పూజలు

రాయికల్/బీర్‌పూర్ మార్చి 26: మండలంలోని కట్కాపూర్ వెన్నముద్దల గండి మల్లికార్జున స్వామి గొల్ల కేతమ్మ జాతరలో ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయికల్, బీర్‌పూర్ మండలాల నాయకులు, సర్పంచులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

జగిత్యాలపై మత్తు పడగ



- భారీగా చిక్కుతున్న డ్రగ్స్..గంజాయి
- పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి సరఫరా
- ప్యాకెట్లు, చాక్లెట్ల రూపంలో విక్రయాలు
- యువకులు, విద్యార్థులే టార్గెట్

జగిత్యాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు దిచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో భారీగా తరలివస్తున్న గంజాయి...మరో వైపు పెద్ద ఎత్తున రవాణా అవుతున్న ప్యాకెట్లు, చాక్లెట్ల రూపంలో వస్తున్న గంజాయి... ఇంకో వైపు వందల సంఖ్యలో బయట పడుతున్న మత్తు ఇంజక్షన్లు.. ఇవి చాలవన్నట్లుగా ఊహించని రీతిలో విశాఖ, సీలేరు ప్రాంతం నుంచి దిగుమతి అవుతూ పట్టుబడ్డ గంజాయి.. ఇటీవల ఒక్కసారిగా జిల్లాలో కలకలం రేపాయి..!

ప్రశాంతంగా ఉన్న జిల్లాను మాదక ద్రవ్యాల ముఠాలు తమ అక్రమాలకు అనువైన స్థావరంగా భావిస్తున్నాయి. పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు, ఎక్సయిజ్ పోలీసులు రోజు రోజుకూ నిఘాను తీవ్రతరం చేస్తున్నప్పటికీ కేవలం సమాచారం ఉన్నంత వరకే వీటిని స్వాధీనం చేసుకోగలుగుతున్నారు. సమాచారం అందని సరుకు మార్కెట్‌లో యథేచ్ఛగా చలామణి అవుతోంది. గంజాయి, డ్రగ్స్‌లకు ప్రధానంగా యువత, నిరుపేద విద్యార్థులు, బాలురు, బాలికలను టార్గెట్‌గా చేస్తూ అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా ఇతర చిన్నా, పెద్ద నేరాల్లోనూ మత్తు వ్యసనదారులు భాగస్వామ్యం అవుతున్నారని భావిస్తున్నారు.

జిల్లాలో నమోదైన గంజాయి కేసులు...

జిల్లాలో 2021 సంవత్సరంలో 14 గంజాయి కేసులు నమోదు కాగా 38 మందిని పోలీసులు అరెస్టు చేసి సుమారు 30 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 2022లో 11 గంజాయి కేసులు నమోదు కాగా 32 మందిని అరెస్టు చేసి సుమారు 18.42 కిలోల గంజాయిని పట్టుకున్నారు. 2023లో 13 గంజాయి కేసులు నమోదు కాగా 36 మందిని పోలీసులు అరెస్టు చేసి సుమారు 91.54 కిలోల గంజాయిని పట్టుకున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం రాయికల్, మల్లాపూర్ మండలాల్లో విశాఖ నుంచి తెచ్చి విక్రయానికి తీసుక వెళ్తున్న 10 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో పోలీసులకు పట్టుబడ్డ వారిలో చదువు మానేసిన విద్యార్థులు, యువకులు ఉండడం గమనార్హం. మరొక ఘటనలో గంజాయి వ్యసనానికి గురైన ఓ బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు ట్రాప్ చేయడం, మరో ఇద్దరు యువకులు సైతం అఘాయిత్యానికి పాల్పడిన సంఘటన వెలుగుచూడడం కలకలం రేపింది.

ప్యాకెట్లు, చాక్లెట్ల రూపంలో...

పొరుగు రాష్ట్రాలు, జిల్లాల నుంచి జిల్లాకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తెచ్చిన గంజాయిని ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. పలు ప్రాంతాల్లో చాక్లెట్ రూపంలో సైతం విక్రయిస్తున్నట్లు సమాచారం. ఆంధ్రా ప్రాంతం నుంచి పలువురు యువకులు బైక్‌లు, ఇతర వాహనాల్లో తీసుకొస్తుండగా, ఆంధ్రా నుంచి ఇక్కడికి దిగుమతి అయ్యే కొబ్బరి బోండాలు, ఇతర వాహనాల్లో సైతం గుట్టు చప్పుడు కాకుండా గంజాయి తరలిస్తు న్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు, ఇతర జన సంచార ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్న టీలాలు, పాన్ డబ్బాలు, చిన్న చిన్న కిరాణాలు, సిగరెట్ అడ్డాల్లో గంజాయి విక్రయిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్ రూ. 500 నుంచి రూ. 1,000 వరకు, పావు కిలో సుమారు రూ. 3,500, అరకిలో సుమారు రూ. 6,500 కిలో సుమారు రూ. 13,000 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో చాక్లెట్ రూ. 30 నుంచి రూ. 50 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు..

మత్తు పదార్థాలకు అలవాటైన యువతీ యువకులు, విద్యార్థులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు తయారు చేసుకుంటున్నట్లు అనుమానాలున్నాయి. విద్యార్థులు, యువతీ యువకులకు అలవాటు అయ్యే వరకు తక్కువ ధరకు, ఉచితంగా అందిస్తున్న మత్తు పదార్థాలను తదుపరి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కోడ్ భాషాలలో చాటింగ్ చేస్తూ మత్తు పదార్థాలు ఎక్కడ, ఎప్పుడు సరఫరా చేస్తారో సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నట్లు సమాచారం.

జగిత్యాల కేంద్రంగా నార్కోటిక్స్ డ్రగ్స్ విక్రయాలు...

జగిత్యాలకు చెందిన ఓ వైద్యుడు ఇటీవల ప్రాణాంతక మత్తు మందును పక్కదారి పట్టిస్తున్న సంఘటనను డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు వెలుగులోకి తెచ్చారు. మార్ఫిన్ లాంటి మత్తు వచ్చే నార్కోటిక్ ఇంజక్షన్లు, మాత్రలను జిల్లాతో పాటు హైద్రాబాద్ వంటి ప్రాంతాల్లో పలువురు మ త్తుకు బానిసైన వారికి పార్సిల్ ద్వారా అందజేస్తున్న తీరు కలకలం రేపిం ది. జగిత్యాలకు చెందిన మానస హాస్పిటల్ ఈఎన్‌టీ వైద్యుడు మదన్ మోహన్ ఇటీవల హైద్రాబాద్‌లోని సైనిక్‌పురి ప్రాంతంలోని శ్రీసాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో ఓ ఇంట్లో మార్ఫిన్ ఇంజక్షన్లు, మాత్రలు నిల్వ ఉంచి అధికారులకు పట్టుబడ్డాడు. ఈ మందులన్నీ జగిత్యాలలోని మానస హాస్పిటల్ నుంచి సదరు డాక్టర్ ద్వారా వచ్చాయని గుర్తించారు. జగిత్యాలలోని గొల్లపల్లి రోడ్డులో గల ఓ ఫార్మసీకి చెందినవిగా కనిపెట్టారు. నార్కోటిక్ డ్ర గ్స్ విక్రయాలు జరపడానికి ప్రత్యేక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. మందుల వినియోగానికి రిజిస్టర్ నిర్వహించాలి. డాక్టర్ల సలహాలు, పర్యవేక్షణలో ఆపరేషన్ సమయంలో గానీ ఇతర అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన మత్తు మందులను విచ్చలవిడిగా నిల్వ చేయడం చర్చనీయాం శమైంది.

జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు..

పిల్లలు చెడు వ్యసనాలకు లోను కాకుండా ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన, మహిళా సంఘాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే మేలు జరుగుతుందని పలువురు అంటున్నారు. పిల్లల్లో విపరీత ప్రవర్తనను కనిపెట్టిన వెంటనే సదరు విద్యార్థులు, యువతకు కౌన్సెలింగ్ నిర్వహించడం, మంచి, చెడుల గురించి వివరించడం, మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఎదరయ్యే దుష్ప్రభావాలు వివరించి, సత్ప్రవర్తన వైపు మలిగేలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.



మైనర్లు..విద్యార్థులు..యువతే టార్గెట్‌గా..

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా దందా మాత్రం యథేచ్ఛగా సాగుతోంది. మైనర్లు, విద్యార్థులు, యువతే టార్గెట్ చేసుకొని గంజాయి విక్రయిస్తున్న ముఠాలు, గంజాయి అక్రమ రవాణాకు సైతం విద్యార్థులనే ప్రోత్సహిస్తున్నారు. పలువురు విద్యార్థులు అర్ధాంతరంగా చదువులు మానేసి గంజాయి రవాణా చేస్తున్నారు. తాజాగా విశాఖ, సీలేరు ప్రాంతాల నుంచి జగిత్యాలకు తీసుకవ స్తున్న అయిదుగురు యువకులను పోలీసులు పట్టుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గంజాయిని విద్యార్థులకు సరఫరా చేస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. పలువురు విద్యార్థులు, యువత తల్లిదండ్రులకు తెలియకుండా అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడుతున్నారు.

● జిల్లాలోని ఓ పట్టణంలోని ఓ టాకీస్ ఏరియాలో నివాసముంటున్న 7వ తరగతి ఓ విద్యార్థి ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. గంజాయి వ్యసనానికి లోనైనా ఇతని నడవడిక సరిగా లేదని సదరు పాఠశాల నిర్వాహకులు టీసీ ఇచ్చి పంపించారు. తల్లిదండ్రులను, కొట్టడం, డబ్బుల కోసం వేధించడం వంటివి చేశాడు. దీంతో తల్లిదండ్రులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. శిశు సంరక్షణ అధికారులు ట్రీట్‌మెంట్ ఇప్పించే సమయంలో సైతం సదరు అధికారులపై దాడికి పాల్పడ్డాడు. గత యేడాదిగా చికిత్స అందిస్తూ ప్రస్తుతం ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి పరీక్ష రాయించడానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు.

● జిల్లాలోని ఓ పట్టణంలోని ఓ విద్యార్థి 9వ తరగతిలో మత్తు మందుకు అలవాటు పడ్డాడు. ఉపాధి నిమిత్తం తండ్రి దుబాయికి వెళ్లాడు. పాఠశాలలకు సరిగా వెళ్లకపోవడం, అమ్మను తిట్టడం, చనిపోతానంటూ బెదిరించడం వంటివి చేశాడు. దీంతో దుబాయిలో పనిచేస్తున్న తండ్రి అర్థాంతరంగా స్వగ్రామానికి వచ్చాడు. అయినప్పటికీ బైక్ కొనివ్వాలని, మొబైల్ కొనివ్వాలని పట్టుబట్టాడు. ప్రస్తుతం సదరు విద్యార్థికి ఓపెన్ టెన్త్ రాయించడానికి తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారు.

● జిల్లాలోని ఓ పట్టణంలో ఓ మెస్ నడిపిస్తున్న మహిళ తాను సంపాదించిన డబ్బులు ఇంట్లో పెట్టుకోగా తరుచూ దొంగతనానికి గురికావడంతో ఆందోళనకు గురైంది. పనిచేస్తే గానీ పొట్ట గడవని కుటుంబ పరిస్థితిలో ఉంది. 9వ తరగతి చదువుతున్న కొడుకు డబ్బులు దొంగిలిస్తున్నాడని, సదరు డబ్బులతో మత్తు పదార్థాలు కొనుగోలు చేసి వ్యసనదారునిగా తయారు అయ్యాడని గమనించి షాక్‌కు గురైంది.

● జిల్లాలోని ఓ పట్టణంలో ప్రభుత్వ ఉపాధ్యాలుగా పనిచేస్తున్న ఇద్దరు తల్లిదండ్రులకు చెందిన ఓ కుమార్తె 9వ తరగతి చదువుతోంది. సదరు విద్యార్థినికి ఇద్దరు సీనియర్ విద్యార్థులు పరిచయం అయ్యారు. వారి సహాయంతో మత్తు పదార్థాలు అలవాటు చేసుకోవడంతో పాటు సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేయడం వంటివి చేస్తోంది. విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు కుమార్తెపై ఆగ్రహం వ్యక్తం చేసి బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంచారు. అయినా కూడా సదరు విద్యారిని ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్ మెయిల్ చేస్తోంది.



● జిల్లాలోని ఓ మారుమూల గ్రామానికి చెందిన ఓ ఇద్దరురు అన్నదమ్ములు గంజాయికి అలవాటు పడ్డారు. చిన్ననాడే తండ్రి మృతి చెందడంతో తల్లి పెంచి పోషిస్తోంది. 8వ తరగతి చదువుతున్న సదరు విద్యార్థులు గంజాయి కొనుగోలు చేయడానికి తల్లి డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలకు పాల్పడటం గ్రామస్థులు గమనించారు. చోరీ చేసిన వాటిని విక్రయించడం వల్ల వచ్చిన డబ్బులతో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలు ప్రాంతాల్లో చోటు చేసుకుంటున్నాయి.

తాగునీటి ఇబ్బందులు కలగొద్దు

కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లు, తాగునీరు తదితర అంశాలపై అధికారులకు పలు సలహాలు, సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో 3,975 బోర్ వెల్స్ ఉండగా 764 బోర్‌వెల్స్ మరమ్మతులు చేపడుతున్నామన్నారు. జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సంపత్ రావు, జిల్లా వ్యవసాయ అధికారిణి వాని, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల వినతి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు ఏబీవీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కలిసి సమస్యను విన్నవించారు. నిరుపేద యువతీ యువకులు, విద్యార్థులను టార్గెట్ చేస్తూ మత్తుకు బానిసలను చేస్తున్న మాఫియాను పట్టుకొని చట్టపరంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ రాక సాయి కుమార్, నాయకులు జస్వంత్, అరవింద్, శివ కృష్ణ, ప్రజయ్, భాను ప్రసాద్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల నుంచి ఢిల్లీకి రైల్వే లైనుకు కృషి

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల నుంచి ఢిల్లీకి రైల్వే లైను వేయిస్తానని రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిపించి కొట్లాడే అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పద్మశాలీల ఆత్మీయ సమేళ్లన కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి నివాసంలో నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. జగిత్యాల ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుంతుందన్నారు. గతంలో జగిత్యాల ప్రాంతానికి ఎంపీగా వ్యవహరించిన కవిత ఏనాడు అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. జిల్లా కేంద్రంలో ప్రధాన సమస్యగా ఉన్న యావర్ రోడ్డు విస్తరణను రూ. 100 కోట్లు అయినా సరే వెడల్పు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఎంపీగా అవకాశం ఇస్తే జగిత్యాల నుంచి మంచిర్యాల మీదుగా ఢిల్లీకి రైల్వే లైను వచ్చేలా కొట్లాడుతానన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం జగిత్యాల ప్రాంతాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదో ఎంపీ అర్వింద్ ప్రజలకు సామాధానం చెప్పాలన్నారు. మోదీ రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో సమాదానం చేప్పడంతో పాటు బీజేపీ నాయకులు గుండె మీద చేయి వేసి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి, మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరినాగభూషణం, దేశాయ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం

నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గులాబీ దళపతి కేసీఆర్ పాలన హయాంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం జరిగిందని నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రూబీ ఫంక్షన్ హాలులో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందును కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఆర్‌ఎస్ సర్కారు పాలనలో రాష్ట్రంలోని మజీదులు, షాదీఖానాలు, ఖబర స్తాన్‌లు అభివృద్ధి చేశామన్నారు. మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి ఒక్కొక్క విద్యార్థిపై రూ. లక్షలు వెచ్చించామన్నారు. షాదీము బారక్ పథకం కింద నిరుపేద ముస్లీం మైనార్టీ యువతుల వివాహానికి రూ. 1,00,116 ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


గోవర్ధన్‌కు మిఠాయి తినిపిస్తున్న ముస్లిం నాయకులు

మధ్యమానేరులో మట్టి నింపడంపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా మధ్య మానేరు ప్రాజెక్టులో మట్టి నింపిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో మధ్య మానేరు నుండి అంతగిరి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణం చేపట్టారు. కాల్వ పనులు నిర్వహించిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్ నిబంధనలకు విరుద్ధంగా కాలువ నిర్మాణంలో తోడిన మట్టిని మధ్య మానేరులో డంపు చేశారు. దీంతో మధ్య మానేరులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని డంపు చేసిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య పేర్కొన్నారు.

దాడిలో గాయపడ్డ వివాహిత మృతి


మేడిశెట్టి రమ

జగిత్యాలరూరల్, మార్చి 26 : కూతురిని తనకిచ్చి పెళ్లి చేయలేదన్న కోపంతో ఓ యువకుడు వివాహితపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి రమ (40) అనే మహిళకు కొడుకు రిషి, కూతురు వాణి ఉన్నారు. భర్త సురేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. దీంతో రమ స్వగ్రామమైన తిప్పన్నపేటలో నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బోగు ప్రకాశ్ రమ కూతురు వాణిని పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజుల నుంచి వెంటపడుతున్నాడు. దీనికి రమతో పాటు కుమారుడు నిరాకరించారు. ఇదే విషయమై పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగాయి. వాణితో తనకు పెళ్లి కాకుండా అడ్డు పడుతోందనే కారణంగా రమపై ప్రకాశ్ కోపం పెంచుకున్నాడు. రమను చంపేస్తే తన పెళ్లికి ఎవరూ అడ్డుపడరని భావించాడు. సోమవారం తిప్పన్నపేటలో జరిగిన హోలీ వేడుకల్లో బా గంగా రమతో పాటు ఆమె కొడుకుతో గొడవ పడ్డారు. ప్రకాశ్ కొడవలితో రమ గొంతుపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను కరీం నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రమ కుమారుడు రిషి ఫిర్యాదు మేరకు బోగు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదుచేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకున్న నారసింహుడు

● ధర్మపురిలో ఘనంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ● పాల్గొన్న జగిత్యాల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం, తెప్పె, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా, రిటైర్డ్ ఏఎస్‌ఐ కమటం మల్లయ్య, వివిధ రకాల వేషాధారణ, చిన్నారుల నృత్యాలు, బొప్పనపెల్లి ఐలయ్య ఒగ్గు డోలు ప్రదర్శనతో సాయంత్రం వేళలో దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుక వెళ్లారు. దారి పొడవుగా పోలీస్ సిబ్బంది ఆనందోత్సహాల మధ్య నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ గేటు ఎదుట పోలీస్ కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామి వారల సేవలను పోలీస్‌స్టేషన్‌లోకి ఆహ్వానించారు. జగిత్యాల, డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్‌బీ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది స్వామి వారల సేవలను భుజాలపైకి ఎత్తుకుని మోసి లోనికి ప్రవేశించారు. స్వామివారల సేవలను పోలీస్ స్టేషన్ ఆవరణలో అందంగా పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛ రణల మధ్య యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్



పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న స్వామివారి సేవలను భుజాలపై మోస్తున్న ధర్మపురి సీఐ, ఎస్‌ఐ, పోలీస్ అధికారులు

అధికారులు తమ ఆయుధాలు స్వామి వారి సేవల పక్కన ఉంచి పూజలు నిర్వహిండం అనాదిగా వస్తుంది. అనంతరం వేద పండితులు, అర్చకులను పోలీస్ శాఖ పక్షాన శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుని డోలోత్సవం

ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య మధ్యాహ్నం ఉత్సవ మూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణిలో హంస వాహనపైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు డోలోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



బ్రహ్మపుష్కరిణిలో శ్రీ వేంకటేశ్వరుని తెప్పోత్సవం

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 21 లక్షలు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రూ.2 కోట్ల 21 లక్షలకుపై ఆదాయం సమకూరింది. 21 రోజుల వ్యవధిలో భక్తులు స్వామవారి హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 21 లక్షల 29 వేల 350 రూపాయల నగదు, 463 గ్రాముల బంగారం, 19 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట, మార్చి 26: గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 1.52లక్షల నగదును మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. సిరిసిల్లకు చెందిన సతీష్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.92 వేల నగదును, గోరంటాలకు చెందిన సత్తవ్వ ఆధారాలు లేకుండా రూ.60 వేల నగదును తీసుకెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. నగదును సీజ్ చేసి, ఎన్నికల సెల్ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్టు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

మల్యాల : ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న నగదును కొండగట్టు బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన నిమ్మ శివన్న అనే వ్యక్తి కరీంనగర్ నుంచి ఎర్టీగా వాహనంలో లోకేశ్వరంకు రూ.54,500 తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు లేనందున సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబు

● నేటి నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు ● 28న స్వామి వారి కల్యాణం.. 30న రథోత్సవం



వేములవాడ ఆలయం



వేములవాడ ఆలయంలో కల్యాణం కోసం ఏర్పాట్లు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం శివకల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఐదు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగే ఈ వేడుకల కోసం ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. నాల్గవ రోజు 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05ని.ల నుంచి స్వామివారి రథోత్సవం 31వ తేదీ ఆదివారం శివ కళ్యాణోత్సవాలు ముగుస్తాయి. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ఉత్సవాల కోసం ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపంలో శివ కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుండగా, ప్రతి ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఆలయ చైర్మన్ చాంబర్ ముందు గల ఖాళీ స్థలంలో శివ కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో పందిళ్లు వేయడంతో పాటు అందమైన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాల కోసం యాగశాల నిర్మించారు. ఆలయ గోపురాలను, ప్రాకారాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణము, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకళ్యాణోత్సవము సందర్భముగా 28వ తేదీ శుక్రవారం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తా మని, నిత్య చండీ సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు.

భూ ఆక్రమణ కేసుల్లో పలువురి అరెస్టు

● వేర్వేరు కేసుల్లో జడ్పీటీసీ భర్త, కార్పొరేటర్ భర్త అరెస్టు ● అప్పటి తహసీల్దార్ సహా పలువురిపై కేసు



మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు



ఆకుల ప్రకాష్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్



మంద నగేష్, తిరుపతి విష్ణువర్ధన్‌లను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 26: నకిలీ పత్రాలతో భూఆక్రమణకు పాల్పడిన కేసులో కొత్తపల్లి జడ్పీటీసీ భర్త, చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్‌కు వచ్చిన పిర్యాదు వివరాల ప్రకారం.. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన పామ్‌రాజ్ గోవిందరావుకు 1954వ సంవత్సరం కాస్రా పహణి ద్వారా చింతకుంట గ్రామ శివారు సర్వే నంబర్ 106లో ఐదు ఎకరాల 8 గుంటల భూమి ఉండేది. ఆ భూమిలో కుటుంబ సభ్యులు అందరూ అమ్ముకోగా 20 గుంటల భూమి మిగిలి ఉండేది. ఈ 20 గుంటల భూమి ధరణిలో తన తండ్రి పేరే ఉండేదని పామ్‌రాజ్ గోవిందరావు కుమారుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పహణిలో మాత్రం పేరు టాంపర్ అయి అక్రమంగా న్యాలమడుగు చిన్న వీరయ్య పేరు వస్తున్నది. దీనిని గ్రహించిన అప్పటి సర్పంచ్ పిట్టల రవిందర్ ఆ భూమిని కాజేయాలని వీరయ్య పేరు గల మరో వ్యక్తి కొడుకు రాజయ్య పేరుపై అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి ద్వారా కుమ్మక్కై తప్పుడు విరాసత్ ద్వారా ధ్రువపత్రాలు తయారు చేయించాడు. రాజయ్య నుంచి ముందుగానే నిర్ణయించుకున్న పథకం ప్రకారం గడ్డం ఆదిరెడ్డి పేరున 2009 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించారు. 2010 సంవత్సరంలో ఆదిరెడ్డి నుంచి పిట్టల రవీందర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తప్పుడు పత్రాలు అడ్డుపెట్టుకుని దానిని దౌర్జన్యంగా దున్నుతున్నాడని, అడ్డుగా వెళ్తే ఆ భూమి తనదేనని, ఇంకోసారి మీరు వస్తే చంపేస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని బాధితుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావడంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, దీనికి సహకరించిన అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి, న్యాలమడుగు రాజయ్య, గడ్డం ఆదిరెడ్డిలపై కేసు నమోదు చేశారు. నిందితుడు పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో ఒకే భూమిని పలువురికి విక్రయం

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలను సృష్టించి ఒకే భూమిని పలువురికి విక్రయించి, మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రకాశ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో తొమ్మిద్రు నర్సింహారావు 1998లో సర్వే నంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటలు, 161/ఎఫ్‌లో 9 గుంటలు. 162/ఎఫ్‌లో 14 గుంటలు మొత్తం 33 గుంటలు భూమిని కొనుగోలు చేసి ప్లాట్‌లుగా విభజించి పలువురికి విక్రయించాడు. ఇందులో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వంతడపుల సంపత్ అనే వ్యక్తి తొమ్మిద్రు నర్సింహారావు వద్ద 1998లో ఒక ప్లాటును కొనుగోలు చేసాడు. ఇదిలా ఉండగా తొమ్మిద్రు నరసింహారావు పలువురికి విక్రయించిన భూమిని అక్రమంగా మళ్లీ తనపేరిటనే విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కరీంనగర్ గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ హఫీజ్‌కు 33 గుంటలు గుత్తాగా విక్రయించగా, అబ్దుల్ హఫీజ్ అందులో నుంచి సర్వే నెంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటల భూమిని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. తిరిగి ఆ భూమిలో నుంచి 3 గుంటలు భూమిని కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పు సురేష్, వావిలాలపల్లికి చెందిన కట్ట రమ్యలు కావాలనే దురుద్దేశంతో తక్కువ ధరకు కొనుగోలుచేసి అసలు విక్రయదారులైన వారిని ఆ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుడు వంతడుపుల సంపత్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణలో బాధితుడు వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, అతనికి సహకరించిన ఐదుగురు తొమ్మిద్రు నరసింహారావు, ఆకుల ప్రకాష్, మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, ఉప్పు సురేష్, కట్ట రమ్యలపై ఎస్సీఎస్టీ కింద కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, నిందితుడికి 14 రోజుల రిమాండు విధించి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో బెదిరించి 5 లక్షలు దోపిడీ

- రౌడీషీటర్‌తో పాటు మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలు సృష్టించి, మోసపూరితంగా వాటిని చూపి ఒక వ్యక్తిని బెదిరింపులకు గురిచేసి 5 లక్షల దోపిడీకి పాల్పడిన కేసులో రౌడీషీటర్ తిరుపతి విష్ణువర్ధన్, కాంగ్రెస్ నాయకుడు మంద నగేష్‌లను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామానికి చెందిన పంబాల శ్రీనివాస్ తీగలగుట్టపల్లిలోని కార్తికేయ నగర్‌లో సర్వే నెంబర్ 233/ఇలో ప్లాట్ నెంబరు 120/ఏలో 200 చదరపు గజాల స్థలాన్ని గట్టు లక్ష్మి పేరిట కొనుగోలు చేశాడు. ఆ భూమికి తప్పుడు పత్రాలను చూపించి పంబాల శ్రీనివాస్‌ను రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. 5 లక్షల రూపాయలు శ్రీనివాస్ వారికి ఇచ్చాడు. మరో 15లక్షలు కావాలని డిమాండ్ చేయడంతో పంబాల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని నిర్ధారించారు. రౌడీషీటర్ పద్మశాలివాడకు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, కాపువాడకు చెందిన మంద నగేష్‌ను అరెస్టు చేసి మంగళవారం రాత్రి కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో తీగలగుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, తిరుపతి నితిన్‌వర్ధన్‌లపై కేసు నమోదైనట్లు తెలిపారు.

ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి, బాబాయ్‌పై ఫిర్యాదు

బోయినపల్లి, మార్చి 26: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి సౌమ్య, బాబాయ్ గండ్రవెంకటరమణరావు అక్రమాలకు పాల్పడ్డారని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య మంగళవారం బోయినపల్లి ఎస్‌ఐ పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కొదురుపాక గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ బీపీఎల్ కింద అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం పొందారని, అతని సోదరి సౌమ్యకు వివాహం అయినప్పటికీ అక్రమంగా పట్టా పొందారని, అతని బాబాయ్ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెంది గండ్ర వెంకటరమణారావు కూడా అక్రమంగా అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, పట్టా పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ పట్టాలు, అక్రమంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీకి పొందిన వారిపై, సహకరించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 26 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 20 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు, మైనర్‌కు 3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఏడుగురు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్షతో పాటు మొత్తం 16 వేల రూపాయలు జరిమానా విధించారని, మరో 12 మందికి 17 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. నగరంలో ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాల బారినపడి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తలపెట్టవద్దని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: అతివేగంతో అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీస్‌లు తెలిపారు. జమ్మికుంటకు చెందిన సుంకిత భవాణి తన భర్తతో కలిసి బైక్‌పై కోరపల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కోరపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో గౌతమి హాస్టల్ ఎదుట బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆజాగ్రత్తగా నడిపిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: తన తల్లితో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి తన భర్తను కులం పేరుతో దూషించి కత్తితో పొడిచాడని బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన మానుపాటి పూజిత తల్లి పూలమ్మతో ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బొమ్మిడి రాజు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల అతిగా మద్యం తాగి వచ్చిన రాజు పూలమ్మను కొట్టడంతో పూజిత తను ఉంటున్న హౌసింగ్‌బోర్డుకు తల్లిని వెంట తీసుకు వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన రాజు అక్కడకు చేరుకుని పూజిత భర్త సురేష్‌ను కులం పేరుతో దూషించి వంట గదిలో ఉన్న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పంచాయతీ పెద్దలపై కేసు నమోదు

రామడుగు, మార్చి 26: పంచాయతీ పెద్దలుగా వ్యవహరిస్తూ ఒకరి సొమ్మును కాజేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం వేణు తన భార్యతో విభేదాలు రావడంతో కోర్టు ద్వారా విడాకుల కోసం అంగీకారం కుదుర్చుకున్నాడు. ఈ అంగీకారంలో పంచాయతీ పెద్దలైన రాజు, మల్లేశంలు వేణు నుంచి రెండు లక్షలు తీసుకొని వారి మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్నారు. కాగా భార్యభర్తలకు కోర్టు ద్వారా విడాకుల మంజూరు పూర్తి కాకముందే ఆ ఇద్దరు పెద్ద మనుషులు వేణుకు తెలియకుండా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్న రూపాయలను విత్‌డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నారు. సదరు డబ్బులు తనకు ఇవ్వకుండా వేధిస్తూ మోసం చేస్తున్నారని వేణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహేతర సంబంధం ఘటనలో ఏఎస్‌ఐ సస్పెండ్

ఇబ్రహీంపట్నం, మార్చి 26: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ రాములును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్1 ఐజి ఎ.వి. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మహిళ తన భర్త రెండు సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడని తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాధిత మహిళను నమ్మించి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. న్యాయం చేస్తానని బాధిత మహిళను నమ్మించాడు. మహిళ ఫోన్‌నంబర్ తీసుకుని ముచ్చటించడంతో పాటు అమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు.

ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న ఏఎస్‌ఐ రామయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్ -1 ఐజీ ఎ.వి.రంగనాథ్ వెల్లడించారు.

భార్య ఆత్మహత్యకు మరో మహిళ కారణమని హత్య

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గ్రామంలో పులి రేణుక (40) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ ఆత్మహత్యకు కారణమనే అనుమానంతో పులి పద్మ (45) అనే మహిళను రేణుక భర్త పులి గంగన్న కల్లు గీసే ఉలితో పొడిచి హత్య చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

నాలుగేళ్ల నుంచి రేణుకకు పద్మకు గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో పద్మ ఇటీవల ఫిర్యాదు చేసింది. ఇటీవల రేణుకను మంత్రాల నెపంతో పద్మ మానసికంగా ఇబ్బందులకు గురి చేసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రేణుక మంగళవారం భర్త ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త గంగన్న ఇంట్లో ఆత్మహత్య చేసుకుని ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. తన భార్య మృతికి పద్మ కారణమనే అనుమానంతో ఆవేశానికి గురైన గంగన్న తన వద్ద ఉన్న కల్లు గీసే ఉలితో పద్మ ఇంట్లోకి వెళ్లి ఆమెను పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన ధర్మపురి మండలం కమలాపూర్‌లో తీవ్ర విషాదం నింపింది.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

మల్యాల, మార్చి 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను కాదని విడాకులు తీసుకొని మరొకరిని వివాహం చేసుకోవడం జీర్ణించుకోలేని మొదటి భర్త వివాహితను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మల్యాల సీఐ నీలం రవి హత్య కేసు వివరాలను మంగళవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్ జగిత్యాలలో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుండగా జగిత్యాలకు చెందిన కరిపె అంజలితో 2018లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో 2020లో వివాహం చేసుకున్నారు. సంతానం కలుగకపోవడం, మనస్పర్థలతో తరచూ గొడవలు జరుగడంతో 2022లో ఇద్దరు విడాకులు తీసుకున్నారు. అయినప్పటికీ అంజలికి నరేష్ ఫోన్ చేస్తూ వేధించేవాడు. ఈ క్రమంలోనే అంజలికి యాదాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లికి చెందిన వ్యక్తితో రెండవ వివాహం జరిగింది. రెండో పెళ్లి చేసుకొని తనను మోసం చేసిందని ఎలాగైని అంజలిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నరేష్ మళ్లీ అంజలికి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి జగిత్యాలకు రమ్మని చెప్పాడు. అంజలి కూడా తాను రాను అని తేల్చి చెప్పాలని అనుకొని ఈ నెల 17న జగిత్యాలకు రాగా అక్కడ ఇద్దరు కలుసుకున్నారు. తరువాత జగిత్యాలలో మద్యం కొనుగోలు చేసుకున్న నరేష్ మాట్లాడుకుందామని చెప్పి అంజలిని తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని గొల్లపల్లి, రాయపట్నం మీదుగా మ్యాడంపల్లి శివారు వైపు తీసుకెళ్లాడు. ఎటు తీసుకెలుతున్నావని అంజలి అడుగడంతో ఆమెపై దాడి చేయడంతో పాటు గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలో గల కాలువలో పడేసి వెళ్లాడు. చెప్పులు, చున్నీ, సెల్‌ఫోన్ సంచిలో వేసి పొదల్లో వేసి వెళ్లాడు. మరుసటి రోజు మృతదేహం సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి గుజ్జుల రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నరేష్ పోలీసులకు దొరకకూడదనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ పారిపోతుండగా మంగళవారం కొండగట్టు వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో పట్టు బడ్డాడు.

నరేష్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు. అంజలి జగిత్యాలకు వచ్చే ముందు ఈ నెల 15న యాదాద్రి జిల్లా గుండాలలో అదృశ్యం కేసు నమోదు కాగా 17న మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో హత్యకు గురైనట్లు తేలింది.

వంద మందికి పైగా కూలీలు రావాలి

అదనపు డీఆర్‌డీవో మదన్‌మోహన్

కొడిమ్యాల, మార్చి 26 : ప్రతి గ్రామంలో ఉపాధి పనులకు వంద మందికి పైగా ఉపాధి పనులకు కూలీలు రావాలని అదనపు డీఆర్‌డీవో మదన్ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని చెప్యాల గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతక ముందు గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. నర్సరీలో ఖాళీ ఉన్న ప్రాంతాల్లో అదనంగా నారు తీసుకవచ్చి మొక్కలను పెంచాలన్నారు. అదనపు డీఆర్‌డీవో వెంట ఏపీవో సతీష్, ఇంజనీర్ రమాపతి, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతా

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



రైతులతో కలిసి పంప్‌లను పరిశీలిస్తున్న విప్

ఎండపల్లి, మార్చి 26 : గత ప్రభుత్వం రైతుల గురించి ఏనాడు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులకు శాశ్వత పరిష్కారం చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ్ రైతులతో కలిసి పంప్ మోటర్‌లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు సాగునీటికి ఇబ్బందులని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు శాశ్వత పరిష్కారం గురించి ఏనాడు ఆలోచించలేదని, మళ్లీ రైతులపై కపట ప్రేమ చూపెడుతోందన్నారు.. కోడ్ ముగియగానే సీఎం, మంత్రుల సహకారంతో శాశ్వత పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ధర్మపురి నియోజక వర్గ రైతులకు కొప్పుల ఈశ్వర్ చేసిందేమి లేదని రైతులపై కపట ప్రేమ చూపెట్టవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, బాలసాని మల్లేశం గౌడ్, గడ్డం లింగారెడ్డి, ఆవుల తిరుపతి, గాజుల విజయ్, గెల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ ఎన్నికల స్టంట్

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి గోవర్ధన్

జగిత్యాల రూరల్, మార్చి 26: కాంగ్రెస్ నేతలకు షుగర్ ఫ్యాక్టరీ అనేది ఎన్నికల స్టంట్ అని, మాజీ ఎంపీ కవిత హయాంలోనే నిజామాబాద్ అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస నుంచి ఎమ్మెల్యే సంజయ్ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌లతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం బీఎల్ఎన్ గార్డెన్‌లో జగిత్యాల అర్బన్, రూరల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్‌లో గులాబీ జెండా ఎగురవేయాలని, తెలంగాణవాణి ఢిల్లీలో వినిపించాలంటే బీఆర్ఎస్ గెలిపించాలని కోరారు. అర్వింద్ సోషల్ మీడియా యాక్టర్ అని, జీవన్‌రెడ్డి మాటలు చెవిలో పువ్వులు పెట్టే విధంగా ఉంటాయని విమర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా నిధుల మంజూరు కోసం సీఎంని కలవడం పరిపాటి అన్నారు. మిషన్ భగీరథ ద్వారా 30 ఏళ్ల మరుగునపడ్డ ధరూర్ క్యాంపు ట్యాంక్‌ను బాగు చేసుకున్నామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ అభివృద్ధి చేసే నాయకుడు బాజిరెడ్డి గోవర్ధన్‌ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మహేష్ ఏఎంసీ చైర్మన్ రాధ రవీందర్‌రెడ్డి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బాలముకుందం, మాజీ సర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, మార్చి 26 : పట్టణ పద్మశాలి సంఘ అధ్యక్షుడు జుక్కుల ప్రసాద్ దంపతులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీలో చేరారు. మంగళవారం పట్టణంలోని సాయి రాంపుర కాలనీ లోని జక్కుల ప్రసాద్ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో ప్రసాద్ దంపతులతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన వాజీద్ కాంగ్రెస్‌లో చేరగా వారికి జువ్వాడి నర్సింగరావు పార్టీ కండవా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఏంబేరి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు అడెపు మధు, తిరుమల గంగాధర్ గౌడ్, గడ్డం వెంకటేష్ గౌడ్, మచ్చ కవిత, ఎంబేరీ సత్యనారాయణ, మార్గం ప్రతాప్, పోతుగంటి శంకర్, తుపాలకు బాజన్న పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: రైతు ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని అయిలాపూర్ సింగిల్ విండో చైర్మెన్ చింతకుంట సాయిరెడ్డిలతో పాటు పలువురు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడారు. రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను అభివృద్ధి దిశగా నడిపించే విధంగా చర్యలు తీసు కుంటున్నాడని అన్నారు. ఎంపీటీసీ చింతకుంట వనిత-సం జీవరెడ్డి పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సాయం అందజేత

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇస్రాజ్ పల్లె గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాధగా మారిన నిరుపేద కుటుంబానికి చెందిన పురాణం స్రవంతి అనే నిరుపేద యువతి వివాహానికి మండల కేంద్రానికి చెందిన తాజామాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్ రెడ్డి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించి మంగళవారం అండగా నిలిచారు. తాజా మాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యానారాయణ గౌడ్, కొండ వెంకటేష్ గౌడ్, నాయకులు

పెగడపల్లి : పేదింటి యువతి వివాహానికి చేయూతనందించి మానవత్వాన్ని చాటుకున్నారు నామాపూర్ మాజీ ఎంపీటీసీ కొమురెల్లి ఆనందం కుటుంబ సభ్యులు. మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటంబానికి చెందిన ఆత్మకూరి స్వామి ఇటీవల అకాల మరణం చెందాడు. ఆయన కూతురు అంకిత పెళ్లి ఈ నెల 27న నిశ్చయమవగా వివాహం చేసే ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే ఉండగా గ్రామస్థులు నామాపూర్ మాజీ ఎంపీటీసీ కొమురెల్లి ఆనందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం పెళ్లి కూతురు అంకితకు ఆనందం కుమారుడు రాజు చేతుల మీదుగా పుస్తె, మట్టెలు, నూతన బట్టలు అందజేశారు.

బిల్లులు రావు..

- అసంపూర్తి నిర్మాణాలతో పంచాయతీ కార్యాలయాలు
- పట్టించుకోని పాలకులు.. అసౌకర్యాలతో తంటాలు

భవనాలు పూర్తి కావు



తక్కళ్లపల్లిలో నిలిచిన పనులతో అసంపూర్తిగా భవనం



సర్వాపూర్‌లో తాళం వేసి ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం

మల్యాల, మార్చి 26: గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ భవనాల నిర్మాణాలు అర్థంతరంగా నిలిచి పోవడంతో ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు సౌకర్యంగా పాలన సేవలు అందించడానికి పంచాయతీ కార్యాలయాలు ఉంటుండగా పలు గ్రామాల్లో అ సంపూర్తి నిర్మాణాలతో దర్శనిమిస్తున్నాయి. మల్యాల మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉండగా ఏడు గ్రామాల్లో రూ.16-20లక్షల ఈజీఎస్ నిధులతో ఏడాది క్రితం పనులు చేపట్టారు. ఇందులో మూడింటిని పనులు పూర్తి స్థాయిలో కాకున్న ప్రారంభించగా మిగితావి నిధుల లేమితో పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని రామన్నపేట, మ్యాడంపల్లి, సర్వాపూర్‌లోని గ్రామ పంచాయతీ నూతన భవనాలను శాసన సభ ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభించారు. వీటి పనులు కొంత మేర పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ప్రారంభించగా గొర్రెగుండం, గొల్లపల్లి, తక్కళ్లపల్లి, గుడిపేట గ్రామాల్లోని భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో శిథిల భవనాల్లోనే అధికారులు కాలం వెల్లదీస్తున్నారు. అయిదేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన గొర్రెగుండం, గుడిపేట గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేక గొర్రెగుండంలో అద్దె షెడ్డులో, గుడిపేటలో పాఠశాల భవనంలో కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. దీంతో అందరికీ అసౌకర్యంగా ఉండడంతో నూతన భవన నిర్మాణాలు చేపట్టగా అవి త్వరితగతిన పూర్తి కావడం లేదు.

● బిల్లులు రాకపోవడంతోనే..

నూతన పంచాయితీ కార్యాలయాల భవన నిర్మాణాలకు నిధుల లేమి వెంటాడుతోంది. ఒక్కో భవనానికి ఈజీఎస్ ద్వారా రూ.16లక్షల మేర నిధులు విడుదల కాగ స్థానిక అవసరాలను బట్టి అదనంగా పంచాయతీ నిధులతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు సగం మేర పూర్తి కాగా బిల్లులు రాక పోవడంతో పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. చేసిన పనుల బిల్లుల కోసం ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు ఎదురుచూస్తూ ప్రభుత్వం నిధులు విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భవనాలు పూర్తి అయితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండనున్నాయి. పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేసి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాల్సి ఉందని పలువురు అంటున్నారు.

● జీపీ కార్యాలయానికి కాంట్రాక్టర్ తాళం

సర్వాపూర్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనానికి నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం తాళం వేశాడు. ఈ భవన నిర్మాణ పనులు కొంత మిగిలి ఉండగానే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడానికి కొద్ది రోజులు ముందు రెండు నెలల క్రితం ప్రారంభించారు. తరువాత కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి రావాల్సి ఉండగా మరుసటి రోజే కాంట్రాక్టర్ తాళం వేసుకున్నాడు. రూ. 20 లక్షలకుగానూ కేవలం రూ 6 లక్షలు మాత్రమే బిల్లులు రావడంతో కాంట్రాక్టర్ తాళం వేసినట్లు తెలుస్తోంది. ప్రారంభించిన ఈ భవనంలో టైల్స్ ఇతరాత్ర పనులు చేపట్టాల్సి ఉంది. బిల్లులు వస్తేనే పనులు పూర్తి చేసి అధికారులకు భవనం అప్పగించనున్నట్లు కాంట్రాక్టర్ తేల్చి చెప్పడంతో ప్రారంభించినప్పటికీ నిరుపయోగంగా మారినట్లు అయింది.

నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, మార్చి, 26: వేసవిలో నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదే శించారు. గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ ఓజ్జెల బుచ్చిరెడ్డితో కలిసి సందర్శించారు. వార్డుల్లోని కాలనీలలోని రోడ్లు, మురికి కాలువలు, పారిశుద్ధ్యం పనులు, మంచి నీటి సరఫరా పరిశీలించి ఏమైనా ఇబ్బందుల గురించి కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో నేల కొన్న మంచి నీటి, పారిశుద్ధ్యం పనులపై ఉన్నత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని మిషన్ భగీరథ సరఫరాలో పైప్ లైన్‌ల లీకేజీల పనులను త్వరగా పూర్తి చేసి, వేసవిలో నీటి సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచి నీటిని సరఫరా చేయాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దెబ్బ తిన్న మురికి కాలువ పనులను త్వరగా చేపట్టి సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను సూచించారు. పట్టణంలో ఎలాంటి సమస్యలు ఉన్న నేరుగా సంప్రదించాలని, అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి అందించాలని అధికారులకు ఆదేశించారు. గుడ్ మార్నింగ్‌లో కార్యక్రమంలో కాలనీల్లో ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి పరిశీలించి తగిన వైద్య సూచనలు చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈయన వెంటా కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, టీఆర్ఎస్‌వై నియోజక వర్గం యువనేత ఓజ్జెల శ్రీనివాస్, నాయకులు ద్యావనపల్లి రాజారాం, మోరపు తేజ, శివచరణ్ పాల్గొన్నారు.



మురికి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

ట్రిపుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు

కొడిమ్యాల, మార్చి 26 : ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ అన్నారు. మంగళవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలను ఇవ్వకూడదన్నారు. ఒక వేళ మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే చర్యలు తప్పవన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడిపిన వారిపై జరిమానాలను విధిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాలో మద్యం తాగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటలకు మేలు

మల్యాల, మార్చి 26: సస్యరక్షణ చర్యలు, మోతాదులో యూరియ వినియోగించడం వల్ల పంటలకు మేలు జరుగుతుందన రైతు శిక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.ప్రియదర్శిని సూచించారు. మల్యాల రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి వాణీతో పాటు ఏడీఏ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న పంటల సస్యరక్షణ చర్యలు, సేంద్రియ వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే సమగ్ర వ్యవసాయం, డ్రోన్లతో వ్యవసాయ సాగు గురించి వ్యవసాయ శాస్త్రవెత్తలు ఎం.గోవర్ధన్, ఎన్, రాంగోపాల్‌వర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, మంజుల, శ్రీనివాస్, ప్రశాంత్, కె.శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు

కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల రూరల్, మార్చి 26 : మండలంలోని నాగులపేటలోని నాగులమ్మ దేవాలయ కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. దేవాలయ అధ్యక్షుడుగా సంగ బీమాలింగం, కోశాధికారిగా కరిపే తిరుమల్‌లను ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఎఖీన్‌పూర్ సింగిల్ విండో చైర్మెన్ నర్సారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ టికెట్ రేసులో కొమిరెడ్డి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ రేసులో మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతి దేవీ పేరు వినిపిస్తోంది. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కొమిరెడ్డి జ్యోతి దేవీ ఇటీవల హైద్రాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాసు మున్షిని కలిసి ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దివంగత మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు సతీమణి అయిన కొమిరెడ్డి జ్యోతి దేవీ నిజామాబాద్ ఎంపీ టికెట్‌ను కోరుతూ అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. బీసీ సామాజిక వర్గంలోని మహిళా నేతగా తగిన అవకాశాన్ని ఇవ్వాలని పట్టుపడుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి పేరు ప్రధానంగా చర్చల్లోకి వస్తుండగా, జిల్లాలో కోరుట్ల నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతీ దేవీ చేస్తున్న ప్రయత్నాలు కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

ప్లాస్టిక్ వినియోగం హానికరం

కోరుట్ల, మార్చి 26 : ప్లాస్టిక్ వినియోగం హానికర మని మున్సిపల్ కమిషనర్ తిరుపతి దుకాణ యజమానులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని వివిధ పండ్ల దుకాణాలు బేకరీ షాపులు, కిరాణ దుకాణాలలో కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలలో నిలువ ఉన్న సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోని వారికి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్ అంజయ్యల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాత్యాయనీ కల్యాణ వ్రతం

మెట్‌పల్లి, మార్చి, 26 : పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ కల్యాణ వ్రతాన్ని నిర్వహకులు ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు జరిపించారు. భక్తులచే కుజదోష నివారణ కోసం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి చక్రస్నానం



స్వామి వారికి చక్రస్నానం చేపిస్తున్న అర్చకులు

కోరుట్ల, మార్చి 26 : పట్టణంలోని అష్టలక్ష్మి సహిత లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి చక్రస్నానం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అర్చన, అభిషేక కార్యాక్రమాలను జరిపారు. ఉత్సవ మూ ర్తులకు ప్రత్యేకంగా అలంకరించి పూజలను నిర్వహించారు. దేవాలయ అవరణలోగల కోనేటిలో సుదర్శన పెరుమాండ్లకు చక్రస్నానం జరిపారు. అనంతరం సుదర్శన నరసింహ హవనం నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకుడు బూరుగు రామస్వామి గౌడ్-సుభద్ర దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సముద్రాల శ్రీరామచార్యులు, ఇందూరి మధుసూ దనాచారి, శ్రీనివాసాచార్యులు, శివకుమారచార్యు లు, మాధవాచార్యులు, శ్రీకాంతాచార్యులు, సిద్దిక్, కమిటీ సభ్యులు భూమ్‌రెడ్డి, అంజయ్యగౌడ్, గంగాధర్, వెంకటేశ్వర్‌రావు, మహేష్, గంగాధర్, రమేష్, శ్రీనివాస్, సతీష్, భూమయ్య, చందు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

రాయికల్, మార్చి 26: మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో ఫిబ్రవరి 18న ప్రారంభించిన విలేజ్ టు విలేజ్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్ మైతాపూర్, మేడిపల్లి గ్రామాల మధ్య జరుగగా మైతాపూర్ జట్టు విన్నర్‌గా నిలువగా, మేడిపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. మొదటి బహుమతి రూ.20 వేలతో పాటు ట్రోఫీని మైతాపూర్ జట్టుకు అందించగా, రెండవ బహుమతి రూ.10 వేలతో పాటు ట్రోఫీని మేడిపల్లి జట్టుకు అందజేశారు. ప్రైజ్ మనీ స్పాన్సర్ కార్తీక్, ట్రోఫీ స్పాన్సర్స్ ఎండీషేక్, గణేష్, బుల్స్ యూత్ సభ్యులు, ఒల్లాలనవీన్, నిర్వాహకులు శివమణి, పాల్గొన్నారు.

యువతీ, యువకులకు సీపీఆర్‌పై శిక్షణ

రాయికల్, మార్చి 26: రాయికల్ పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో యువతీ, యువకులకు మంగళవారం సీపీఆర్ పై శిక్షణ ఇచ్చారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, ప్రతిమ ఫౌండేషన్ సమన్వయంతో టైలరింగ్, ఎలక్ట్రికల్ హౌజ్ వైరింగ్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతీ, యువకులకు నగునూర్‌లోని ప్రతిమ ఆస్పత్రి వైద్యులు సీపీ ఆర్‌కు సంబంధించిన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ అనుకోని సంఘటనలు, ప్రమాదాలు సంభవించి నప్పుడు నాడీ పని చేయకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్షతగాత్రులకు, గుండెపోటు బారిన పడిన వ్యక్తులకు తక్షణ సీపీఆర్ ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చునని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ మేనేజర్లు కౌశిక్, గీతారెడ్డి, టెక్నీషియన్‌లు రాజేందర్, లక్ష్మణ్, సిబ్బంది విరాట్, రఘుపతి, శ్యామల, వర్ధిని, జీఎంఆర్ సిబ్బంది ప్రమోద్, నాగేష్, చిరంజీవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

తాండ్ర్యాలలో చలివేంద్రం ప్రారంభం

కథలాపూర్, మార్చి 26 : మండలంలోని తాండ్ర్యాలలో మంగళవారం అరుణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఫౌండేషన్ చైర్మెన్ పానుగంటి శ్యామ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో సామాజిక సేవా కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతామన్నారు. తాండ్ర్యాల ఎక్స్ రోడ్డు వద్ద ప్రయాణీకులకు వేసవిలో దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మాజీ సర్పంచ్ గడీల గంగ ప్రసాద్, ఉరుమల్ల చారి ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌గౌడ్



నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి జీవన్‌గౌడ్‌ను నియమిస్తూ జారీ చేసిన పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అందించారు. పట్టణంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జీవన్ గౌడ్‌కు నియామక పత్రం అందించి అభినందించారు. పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయం కోసం రిటైర్డ్ ఉద్యోగి దీక్ష

కోరుట్ల, మార్చి 26 : పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వాసం భూమనందం తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ముందు మౌన దీక్ష చేపట్టాడు. ఆరు నెలలుగా తన భూమి విషయంలో న్యాయం చేయడంలో అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా మౌన దీక్షకు దిగినట్లు తెలిపారు. తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా సంబంధిత భూమి వివరాలపై పరిశీలన జరిపి చర్యలు తీసుకుటానన్నారు.

అంజన్నకు వెండి గద బహూకరణ

మల్యాల, మార్చి 26: కొండగట్టు ఆంజనేయస్వామికి సిద్దిపేట జిల్లా మిట్టపల్లికి చెందిన భక్తులు వెండి గదను బహూకరించారు. ఈ మేరకు పీర్చపల్లి మల్లారెడ్డి కుటుంబసభ్యులు 250గ్రాముల గదను ఆలయ అధికారులు లతాదేవి, సంపత్‌కు అందజేశారు.

● నేడు హుండీల లెక్కింపు

అంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయంను బుధవారం లెక్కింపు చేపట్టనున్నల్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఆలయ ప్రాకార మండపంలో పటిష్ట భద్రతతో భక్తులు సమర్పించిన సొమ్ములు, కానుకల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు

ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామి దర్శనం కోసం క్యూలైన్లో నిల్చున్న భక్తులు

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి క్షేత్రంలో ఏడవ రోజు మంగళవారం బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు. ఉదయం భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారా యణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ ధర్మశాల ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షించారు.

●బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి ఆరవ రోజు రూ 12,35,017 ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 4,43,900, ప్రసాదాలు విక్రయించగా రూ 6,14,450 లభించాయి. అన్నదానం కోసం భకు సమర్పించిన విరాళాలు రూ 1,75,667 ఉన్నట్లు ఆయన వివరించారు. ఏడు రోజుల్లో మొత్తం 41,55,135 ఆదాయం లభించినట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 27 బుధవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఉత్తర దిగ్యాత్ర, రాత్రి 8 గంటలకు భోగ మండపం, 9 గంటలకు వేదసదస్సు ఉత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి వేళలో భక్తి సంగీతం, లలిత సంగీత కార్యక్రమాలు ఉంటాయి. కొరిడె నరహరి, రాజేశ్వరిచే శాస్త్రీయ సంగీతం ఉంటుందని ఈవో వివరించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన నృత్యభారతి పసుమర్తి శేషుభారతి కూచిపూడి నృత్య ప్రదర్శన మంగళవారం రాత్రి భక్తులను ఆకట్టుకుంది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేళలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరీంనగర్ వాగ్దేవి నృత్య పాఠశాలకు చెందిన టీఎస్ శ్వేత నృత్య ప్రదర్శన, హైదరాబాద్ లాస్య సైన్ ఆర్ట్ అకాడమీ బృందంచే నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. మంచిర్యాలకు చెందిన మామిడి రాజేశ్వరీ బృందం సంగీత కార్యక్రమాలు భక్తులు తిలకించారు. కళాకారులను ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ సన్మానించారు.